

పారిశ్రామిక అవకాశాలు పుష్కలం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు.

- 8లో



'బైజూస్' బోధనకు ట్యాబ్‌లు సిద్ధం

విద్యావ్యవస్థలో బైజూస్ కంటెంట్ బోధనను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేరువచేసింది. ట్యాబ్‌లను ఉచితంగా అందజేస్తోంది.

- 8లో



హోరాహోరీగా...

విజయనగరం నగరంలోని మహిళా పార్కులో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజ చేస్తున్న మహిళా భక్తులు

పాలకొండ: ధనుర్మాసం సందర్భంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో మహిళా భక్తులు బుధవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆడుదాం-ఆంధ్రా పోటీలకు 32వేల రిజిస్ట్రేషన్లు

పార్వతీపురం: ఆడుదాం-ఆంధ్రా పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 32 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. క్రీడాపోటీల నిర్వహణపై తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 47 రోజుల పాటు జరిగే క్రీడాసంబరాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడమే పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సమకూర్చిన క్రీడా సామగ్రిని 350 సచివాలయాలకు చేర్చామని, క్రీడా మైదానాలను సిద్ధం చేశామని తెలిపారు.

నాలుగు కేజీల శిశువు జననం



నీలకంఠాపురం పీహెచ్‌సీలో నాలుగుకేజీల బరువుతో జన్మించిన బేబీ

కురుపాం: సాధారణంగా అప్పుడే పుట్టిన శిశువు బరువు రెండున్నర కేజీల నుంచి మూడున్నర కేజీల బరువు ఉంటుంది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం నీలకంఠాపురం పీహెచ్‌సీలో బుధవారం మధ్యాహ్నం నాలుగు కేజీల బరువుగల ఆడబిడ్డ జన్మించినట్టు డాక్టర్ కె.అమరసింహారెడ్డి తెలిపారు. ఒబ్బంగి పంచాయతీ పరిధిలోని పీరంగూడకు చెందిన ఆరిక స్వాతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీలో చేర్చారు. ఆమెకు వైద్యులు సేవలందించి సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. చికిత్స అందించిన వారిలో స్టాఫ్‌నర్స్ విశేష, ఎంఎల్‌హెచ్‌పీ లలిత, పార్వతి ఉన్నారు.

24న జాషువా కవితా వైభవంపై సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 24న జాషువా కవితా వైభవంపై సదస్సు నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు గురజాడ స్మారక జిల్లా గ్రంథాలయంలో సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్లేపల్లి ఉదయ్‌కిరణ్ (శ్రీకాకుళం) వక్తగా హాజరుకానున్నారన్నారు. సమ్మానకర్తగా సమాఖ్య ప్రత్యేక సలహాదారు బీహెచ్‌కే బాబూజీ వ్యవహరిస్తారని తెలిపారు. సాహితీవేత్తలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అడ్డుకోవడం అవాస్తవం..

విజయనగరం గంటస్తంభం: యువగళం సభకు వెళ్లే ప్రజలను రవాణా శాఖాధికారులు అడ్డుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన ఆరోపణలో వాస్తవం లేదని, బుధవారం తామెక్కడా తనిఖీలు కూడా చేపట్టలేదని జిల్లా డిప్యూటీ ఉప కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ స్పష్టం చేశారు. భోగాపురం మండలం పోలిపల్లిలో యువగళం విజయోత్సవ సభ తెలుగుదేశం పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సభకు భారీగా జనాలను తరలించాలని ఆ పార్టీ నాయకులు భావించారు. అయితే అనుకున్నంత మేరలో జనాలు రాకపోవడంతో ఆ నెపాన్ని ప్రభుత్వంపై నెట్టాలని భావించి అవాస్తవమైన ఆరోపణలు చేశారు. జనాలను తరలిస్తున్న ఆటోలు, ఇతర వాహనాలను రవాణాశాఖాధికారులు ఎక్కడికక్కడే అడ్డుకుని దింపేశారని విమర్శలు చేశారు. వాస్తవానికి రవాణాశాఖాధికారులు సభకు వెళ్లే వాహనాలను తనిఖీ చేయలేదన్నారు.

శరవేగంగా..



మిల్లుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలు

- ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు
- రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ
- అధికారుల నిరంతర పర్యవేక్షణ
- నూర్పిడిచేసిన వెంటనే కొనుగోలు, రవాణా
- గడువుకు ముందే రైతుల ఖాతాలకు నగదు

పార్వతీపురం టౌన్:

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. రైతులు నూర్పిడిచేసి సిద్ధం చేసిన ధాన్యాన్ని కళ్లాల్లోనే కొనుగోలు చేస్తున్నారు. ఈ బృహత్తర క్రతువులో 185 రైతుభరోసా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ, సివిల్‌సప్లై అధికారులు నిమగ్నమయ్యారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తున్నారు. వెంటవెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయడంతో నిర్దేశిత గడువుకు ముందే రైతుల ఖాతాలకు నగదు జమవుతోంది.

మద్దతు ధరకు కొనుగోలు

రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో క్వింటా ధాన్యం సాధారణ రకం రూ.2,183, ఎ-గ్రేడ్ ధాన్యం రూ.2,203కు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. రైతన్నకు మద్దతుగా నిలుస్తోంది. గతంలోనూ ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేది. అయితే రైతులు తమకు తెలిసిన కమీషన్ ఏజెంట్లు, మిల్లర్ల వద్దకు ధాన్యం తీసుకు వెళ్లేవారు. ఇది దళారుల జోక్యానికి వీలు కల్పించేది. కొనుగోలు కేంద్రలో నిర్ధారించిన తేమ శాతం సరిగా లేదనో.. ఎక్కువ ఉందనో.. పొల్లుగింజలు ఎక్కువ ఉన్నాయనో.. ఇలా రకరకాల కారణాలతో ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేవారు కాదు. మద్దతు ధరలో ప్రతి బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు కోత పెట్టేవారు. తద్వారా ఆయా రైతులు ఎకరాకు రూ.2,400 నుంచి రూ.3,300 వరకూ నష్టపోయేవారు. దీనికి తోడు ప్రతికూల వాతావరణంలో పరిస్థితుల్లో రైతుల ఆవేదనను ఆసరాగా చేసుకుని దళారులు మరింత ధర తగ్గించేవారు. ఆన్‌లైన్ అయిన ధ్యాన్యానికి మాత్రమే ప్రభుత్వం సొమ్ము చెల్లించేది. తగ్గించిన బస్తాల సొమ్ము దళారుల పాలై పూర్తిమద్దతు ధర అందక రైతులు నష్టపోయేవారు.



మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

ఇప్పుడు అంతా పారదర్శకమే...

రైతుల కష్టం దళారుల పాలవ్వకుండా, ఏ దశలో నూ వారి జోక్యానికి ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఈ సారి కొనుగోలు నిబంధనలను కట్టుదిట్టం చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆర్బీకేల వద్దకు రైతు ధాన్యం శాంపిల్ తీసుకువెళ్తే చాలు.. అక్కడి కొనుగోలు సిబ్బంది తేమ శాతం నిర్ధారిస్తా రు. ఈ-క్రాప్ నమోదుకు లోబడి ఎన్ని టన్నుల ధాన్యం పంపించేదీ ఆన్‌లైన్ చేయగానే ఏ మిల్లుకు తరలించాలో కంప్యూటర్ సూచిస్తుంది. ఆ మిల్లుకు మాత్రమే ధాన్యాన్ని తరలించాలి. అందుకయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. పండించిన ధాన్యానికి పూర్తి మద్దతు ధర దక్కడంతో రైతు లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సగటున 33 బస్తాల దిగుబడి వస్తుండగా, వివిధ సాకులతో రూ.3,300 వరకూ ఆదదాయం కోల్పోయేవారమని, ఇప్పుడు పూర్తిమద్దతు ధర దక్కుతోందని, గతంలో కోల్పోయిన సొమ్ము ఈసారి ఆదా అవుతోందని రైతులు చెబుతున్నారు.

రైతులకు మేలు



ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పారదర్శక విధానం అమలుచేస్తోంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో ఏదో ఒక కారణంతో బస్తాకు ఎంతోకొంత కోత వేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో పూర్తి మద్దతు ధర అందడంతో ఎకరాకు రూ.2,500పైగా అదనపు ఆదాయం కనిపిస్తోంది.

– వంగపండు శంకరరావు, రైతు, పార్వతీపురం

దళారుల జోక్యానికి చెక్



రైతులు దళారుల చేతిలో నష్టపోకుండా ప్రభుత్వ ఆదేశామేరకు కొత్త విధానంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతు కళ్లాం వద్ద ధాన్యం సేకరించిన నుంచి డబ్బులు ఖాతాకు జమయ్యేవరకు బాధ్యతగా వెళ్తున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ సాగుతోంది. నిర్దేశిత గడువు 21రోజుల వరకు రైతులు ఎదురు చూడకుండానే ముందుగానే ధాన్యం డబ్బులు జమ చేస్తున్నాం. ఇప్పటివరకు జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతులకు రూ.40కోట్లు చెల్లించాం.

– దేవ్లుల నాయక్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం

పార్వతీపురం మన్యం జిల్లాలో కొనుగోళ్ల వివరాలు..	
ధాన్యం కొనుగోలు కేంద్రాలు	185
ధాన్యం సేకరణ లక్ష్యం	3.23 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటివరకు సేకరించినవి	36 వేల మెట్రిక్ టన్నులు
మిల్లర్ల వద్ద రశీదులు జనరేట్ అయినవి	రూ.80 కోట్లు
రైతులకు చెల్లించిన సొమ్ము	రూ.40 కోట్లు
రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలు	1500

పూర్తిస్థాయిలో కొనుగోలు



రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తాం. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించాలి. దళారుల చేతిలో మోసపోవద్దు. ఇప్పటి వరకు జిల్లాలో 36 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించాం. రైతులకు రూ. 40 కోట్లను గడువుకు ముందే చెల్లించాం. గోనెలు, రవాణా చేసేందుకు అయ్యే రవాణా ఖర్చులను సైతం చెల్లిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయాలు రైతులకు మేలు చేస్తున్నాయి.

– ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్, పార్వతీపురం మన్యం

ఉన్నత చదువుకు 'విదేశీ విద్యాదీవెన'



విదేశీ విద్యాదీవెన నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, పాల్గొన్న ఐటీడీఏ పీఓలు

పార్వతీపురం: పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందజేస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్‌తో పాటు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, విద్యార్థులు తిలకించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన గంటేడ సత్యసాయి జగనన్న విదేశీ విద్యాదీవెనకు ఎంపికయ్యాడన్నారు. అమెరికాలోని పర్డ్యూ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందాడని, విద్యార్థికి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం రూ.9లక్షల65వేల540ల సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద బెలగాంకు చెందిన ఆమిటి హరీష్, వీరఘట్టం మండలం హుస్సేనుపురం గ్రామానికి చెందిన తాడెల కార్తీక్‌కు చెరో లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాన్ని అందజేసినట్టు వెల్లడించారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయంతో విద్యార్థులు ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు.

ఎంతో ఉపయోగం

మాది సాధారణ రైతు కుటుంబం. నేను వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సత్యసాయి జీఆర్‌ఈ టెస్టులో ప్రతిభ కనబరచడంతో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి అర్హుడయ్యాడు. ప్రభుత్వం రూ.9.65 లక్షలు మంజూరు చేసింది. మా లాంటి పేద కుటుంబాల విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గతంలో ఈ స్థాయిలో ఏ ప్రభుత్వమూ సాయం చేయలేదు. మా పిల్లలు జీవితాంతం రుణపడి ఉంటారు.

– గంటేడ శ్రీరాములనాయుడు, ఉద్దవోలు, గరుగుబిల్లి మండలం

రైతులకు మేలుచేసేలా కేవీకే సేవలు

- కృషివిజ్ఞాన కేంద్రం సందర్శనలో వ్యవసాయ కళాశాల డీన్ శ్రీనివాస్



మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల డీన్ శ్రీనివాస్

కురుపాం: గిరిజన రైతులకు మేలుచేసేలా కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధనలు చేస్తోందని, కొత్తకొత్త వంగడాలను సృష్టిస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నైరా వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ కోరారు. కురుపాం మండలం రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కేవీకేలలో శాస్త్రవేత్తలు ప్రతినిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక సాగు మెలకువలు తెలియజేస్తారన్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రైతుభరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి.ఎస్.ఎస్.కె.పాత్రో, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంతవిహారి, నైరా వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జి.మోహన్‌నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.జ్యోతిబసు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎ.నిర్మల్ జ్యోతి, అగ్రికల్చర్ అసిస్టెంట్స్ మౌనిక, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

26 నాటికి అభ్యంతరాల పరిష్కారం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను ఈ నెల 26 నాటికి పరిష్కరిస్తామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి 1 నాటిన ఓటరు జాబితా తయారు చేసి జనవరి 5వ తేదీన తుది ప్రచురణ చేస్తామన్నారు. ఓటరు నమోదుకు ఎన్నికల సమయం వరకు అవకాశం ఉందని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ఫారం-6లు 42,360, ఫారం-7లు 46,128, ఫారం-8లు 97,230 వచ్చాయన్నారు. వీటిపై విచారణ జరిపి డిసెంబర్ 26 నాటికి పరిష్కరిస్తామని చెప్పారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించేందుకు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాలో మార్పులుచ చేర్పులు, ఓటర్ల నమోదుకు సంబంధించి లక్షా 85,718 దరఖాస్తులు అందగా, వాటిలో లక్షా 76,638 ఫారాలు పరిష్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ ఆర్.కేశవనాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.రవికుమార్, టి.వెంకటరమణ, పి.అప్పారావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఎన్నికల పరిశీలకుడి రాక

ఉన్నత విద్య రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు గురువారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎలాంటి సందేహాలు, సమస్యలున్నా తెలియజేయాలని సూచించారు.

కౌశల్-2023 పోటీల్లో విజేతలు వీరే..



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ముఖ్య అతిథులు

డెంకాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి కౌశల్ పోటీలు తోడ్పడతాయని బొబ్బిలి విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ అన్నారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భారతీయ విజ్ఞాన మండలి, ఏపీ సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కౌశల్ - 2023 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆన్‌లైన్ ప్రాథమిక క్విజ్‌లో 296 ప్రభుత్వ పాఠశాలల నుంచి 7200 మంది విద్యార్థులు, పోస్టర్ ప్రదర్శనలో 120 పాఠశాలలు పాల్గొన్నాయని చెప్పారు. వీటిలో 36 పాఠశాలల విద్యార్థులకు ప్రత్యక్ష విధానంలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. క్విజ్‌కు సంబంధించి ప్రథమ బహుమతి నెల్లిమర్ల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ద్వితీయ బహుమతిగా డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతిగా చల్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నిలువగా.. ప్రత్యేక పోస్టర్ ప్రదర్శనలో ప్రథమ బహుమతి ఆర్.శివాజీ (మున్సిపల్ ఉన్నత పాఠశాల కస్పా), ద్వితీయ బహుమతిగా వి.లాస్య మాధురి (ఎంజేపీఏపీ నెల్లిమర్ల), తృతీయ బహుమతి ఎ.నాగమహేష్ (గుల్ల సీతారాంపురం), కన్సొలేషన్ బహుమతి కె.పృథ్వి (జీఎంఆర్ సంస్కృత ఉన్నత పాఠశాలకు) లకు దక్కాయి. అలాగే జనరల్ పోస్టర్ ప్రదర్శనలో ప్రథమ బహుమతి టి. దీపిక (కొండవెలగాడ), ద్వితీయ బహుమతి ఎస్.తేజస్విని (జిన్నాం), తృతీయ బహుమతి పి.సునీల్ (తోంద్రంగి), కన్సొలేషన్ పి.ఉదయశ్రీ, (పెదవేమలి)లకు దక్కాయి. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు ఈనెల 30న విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. తిరుపతినాయుడు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ టి.సూర్యనారాయణవర్మ, కౌశల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐకి పైడితల్లి బంగారం



అమ్మవారి బంగారు ఆభరణాలను బ్యాంకు అధికారులకు అప్పగిస్తున్న ఆలయ ఈఓ సుధారాణి, ఆర్‌జేసీ, ట్రస్టు బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన చిన్నపాటి పుస్తెలు, నత్తులు, ముక్కుపుడకలు, తదితర ఐదు కిలోల 75 గ్రాముల బంగారు ఆభరణాలను ఎస్‌బీఐకి ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యుల సమక్షంలో ఈఓ కె.ఎల్.సుధారాణి బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ హుండీల ద్వారా వచ్చిన బంగారాన్ని ఆర్‌జేసీ ఎం.వి.సురేష్‌బాబు, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి దుర్గాభవానీ, ధర్మకర్తల మండలి సభ్యులు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావుల సమక్షంలో అందజేశామన్నారు. బంగారాన్ని కరిగించి ఎస్‌బీఐ గోల్డ్ బాండ్ స్కీమ్‌లో పెడతారని తెలిపారు. ఆ డబ్బులతో ఏటా వచ్చే వడ్డీతో ఆలయానికి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ జైల్‌రోడ్డు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా స్థానిక పూల్‌బాగ్‌లోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశా రు. ఆలయ ప్రధాన అర్చకులు, స్వామి ఉపాసకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో దేవతామూర్తులకు లక్ష పుష్పార్చన సేవ నిర్వహించారు. భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు.



లక్షపుష్పార్చన సేవలో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సెంచూరియన్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు



మాట్లాడుతున్న సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడే స్థాయికి ప్రతిఒక్కరూ ఎదగాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, నాన్ టీచింగ్ సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంగ్లిష్‌లో ప్రావీణ్యాన్ని సంపాదించాలన్నారు. ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల లెక్కింపు

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీలను ఆలయ ఈఓ పద్మావతి, కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో బుధవారం లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ పద్మావతి మాట్లాడుతూ, హుండీల ద్వారా 1,14,647 రూపాయల ఆదాయం వచ్చిందని ఈఓ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, ఆలయ అర్చకుడు సోమశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ పద్మావతి, కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి, తదితరులు

క్లుప్తంగా

ఇంటర్ వర్సిటీ పోటీలకు జీఎంఆర్ ఐటీ విద్యార్థి



ఎల్.కూర్మినాయుడు

రాజాం సిటీ: కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 25 వరకు జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజాం జీఎంఆర్ ఐటీ విద్యార్థి ఎల్.కూర్మినాయుడు ఎంపికైనట్టు పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో రాణించడంతో విద్యార్థిని ఎంపిక చేశారన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.రాంబాబు, విద్యార్థులు అభినందించారు.

ఎయిర్‌స్ట్రిప్ భూములు అప్పగించండి

- తహసీల్దార్‌ను కోరిన విశాఖ నావికాదళ అధికారులు

బాడంగి: విజయనగరం జిల్లా బాడంగి సమీపంలో బ్రిటిష్ కాలంనాటి ఎయిర్‌స్ట్రిప్ భూములతో పాటు అవసరమైన పరిసర ప్రాంతాల్లోని భూమిని అప్పగించాలని విశాఖ నావికాదళ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులను కోరారు. ముగ్గురు నావికాదళ అధికారులు బాడంగి తహసీల్దార్ రఫీజాన్‌ను బుధవారం కలిశారు. అనంతరం ఎయిర్‌స్ట్రిప్ భూములను పరిశీలించారు. మరో 1200 ఎకరాలు అవసరంగా పేర్కొంటూ మండల సర్వేయర్ సాయికుమార్ సహాయంతో ఆయా గ్రామాల భూములలో మార్కింగ్ చేపట్టారు. ఆరుపాయింట్లుకు గాను తొలుత ముగడ, కోడూరు, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన భూముల వద్ద మార్కింగ్‌ప్లెగ్‌లు పాతించారు. నావెల్ డాక్‌యార్డుకు చెందిన ముడిసరుకులు, షిప్‌ల నిర్మాణ సామగ్రిని, విడిభాగాలను ఇక్కడ నిల్వచేసి ఎగుమతులు చేసేందుకు నిర్ణయించినట్టు తెలిసింది. భూ సేకరణ ప్రతిపాదనలు కేంద్రప్రభుత్వానికి పంపించారని, అనుమతులు వచ్చిన వెంటనే బహిర్గతం చేస్తారని తెలిసింది. గతంలో ఒకటి రెండు సార్లువచ్చిన అధికారులు ఏడాది తరువాత తిరిగి రావడంతో ఈ ప్రాంత ప్రజల్లో చర్చ మొదలైంది.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి: అలజంగి వేగావతి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణచక్రవర్తి బుధవారం సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీజ్‌చేసిన ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

ఇంటర్ విద్యార్థినికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని కొన్నావీధి పీఎస్ఎన్ఎం స్కూల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థిని గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్సై ఎస్.ఎస్.దొర తెలిపారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామానికి చెందిన చింతాడ రాజేశ్వరి (17) నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతూ బీసీ సంక్షేమ వసతిగృహంలో ఉంటుంది. వసతిగృహంలో భోజనం చేసిన అనంతరం సైకిల్‌పై కళాశాలకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఆమెను ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై పడిపోయిన రాజేశ్వరికి కుడివైపున తలకు, దంతాలకు గాయాలయ్యాయి. వసతిగృహం సిబ్బంది, తోటి విద్యార్థులు అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కారును ఢీకొట్టిన లారీ

- మహిళకు గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత సమీపంలో జాతీయ రహదారి వంతెన వద్ద కారును లారీ ఢీకొనడంతో మహిళకు గాయాలయ్యాయి. గజపతినగరం నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న కారును బొబ్బిలి నుంచి గజపతినగరం వైపు వస్తున్న లారీ బుధవారం ఢీకొంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలయ్యాయి. ఆమెను వైద్యకోసం 108లో గజపతినగరం సీహెచ్‌సీకి తరలించినట్టు పెదమానాపురం పోలీసులు తెలిపారు.

22న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

విజయనగరం అర్బన్: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ నెల 22న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద రేషన్‌కిట్లు పంపిణీ చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,372 కేంద్రాల పరిధిలో 15,076 మంది గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటివరకు సుమారు 9,318 కిట్లను ఆయా మండలాలకు పంపించామని చెప్పారు. మిగిలిన ఆరు మండలాలకు గురువారం నాటికి కిట్లు చేరుకుంటాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె డబ్బులు విడుదల చేశామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

పారిశ్రామిక అవకాశాలు పుష్కలం

- మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి
- కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు



టీటీడీసీ ప్రాంగణంలో కూరగాయల విత్తనాలు జల్లుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ జిల్లా అవసరాలకు తగ్గట్టుగా వ్యాపారాలను విస్తరించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి మహిళలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు రానున్న దృష్ట్యా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఉండే పథకాలన్నింటినీ కన్వర్జెన్స్‌తో అందిపుచ్చుకోవాలని, దీనికోసం శిక్షణ ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తిని ఆదేశించారు. మహిళా ప్రాంగణాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. జిల్లా సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తొలుత మహిళా ప్రాంగణం ఆవరణలో మొక్కలు నాటి, మహిళలు నిర్వహించే నర్సరీని సందర్శించారు. అదే ఆవరణలో కూరగాయల విత్తనాలను చల్లి మహిళలతో ముచ్చటించారు. నర్సరీ, కూరగాలయలు, పూలమొక్కల పెంపకంతో వచ్చే ఆదాయవివరాలపై ఆరా తీశారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో సాగుతున్న వ్యాపారాలు, వివిధ కార్యకలాపాలను కలెక్టర్‌కు సమాఖ్య ఈసీ సభ్యులు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సూచీల్లో ఆరోగ్యం అత్యంత ప్రధానమైనదని, మహిళా సంఘాల ద్వారా మహిళలు, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యజాగ్రత్తలు వివరించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా ఆగిపోవాలని, దీనికి మహిళలే నడుంబిగించాలన్నారు. ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో మహిళలు భాగస్వాములుకావాలని, ఆటల్లో రాణించేలా సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారిణులందరూ పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లా సమాఖ్య ద్వారా అనేక ఆర్థిక కార్యకలాపాలు నిర్వర్తిస్తూ రూ.7.8 కోట్లు డిపాజిట్ చేసినట్టు వివరించారు. పౌల్ట్రీ, డెయిరీ, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు సహకరిస్తున్నాయన్నారు. సమావేశంలో ఏపీడీ సావిత్రి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షులు, ఈసీ సభ్యులు, డీపీఎంలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు 1.10 లక్షల రిజిస్ట్రేషన్లు

- జిల్లాలో క్రీడా పోటీల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లాలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు 1.10 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారి పేర్లను నమోదు చేయించామని తెలిపారు. పోటీలను తిలకించేందుకు 9 లక్షల మంది ఆసక్తి వ్యక్తం చేస్తూ పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఐదు క్రీడాంశాల్లో పోటీ పడేందుకు 14 వేల మంది ఆసక్తి చూపారని చెప్పారు. జిల్లాలో పురుషుల కంటే మహిళలే అధికంగా క్రీడల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నట్టు చెప్పారు. పోటీల నిర్వహణ కోసం 321 క్రీడామైదానాలు సిద్ధం చేశామని, ఇందులో 75 క్రీడా మైదానాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. క్రీడాకారుల కోసం 20,296 క్రీడా పరికరాల కిట్లు జిల్లాకు చేరాయన్నారు. జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణులు మత్స సంతోషి, ఎస్.పల్లవి, శ్రీలక్ష్మిలను పోటీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి మండలంలో పోటీల నిర్వహణకు మండల ప్రత్యేకాధికారులను నియమించామని, డివిజన్ స్థాయిలో ఆర్‌డీఓల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై కూడా సీఎం ఆరా తీశారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు గ్రామాల్లో కార్డుల పంపిణీని ప్రారంభించామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ ఎస్.డి.అనిత, డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, సచివాలయ సమన్వయ అధికారి నిర్మలాదేవి, డీఎస్‌డీఓ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో సంస్థాగత నియామకాలు

విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సంస్థాగత నియామకాలకు శ్రీకారం చుట్టింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అనుబంధ కమిటీలను నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్రకార్యాలయం ఆయా కమిటీ సభ్యుల వివరాలను వెల్లడించింది. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మకిరెడ్డి ఆశాజాన్, ఉపాధ్యక్షులుగా బిసాప్ కేజీ ఫిలోమెన్, సాధుసలోమి, ప్రధాన కార్యదర్శులుగా పండుయబ్సోజు చౌదరి (విజయనగరం), ఎ.జయప్రకాష్ (నెల్లిమర్ల), టొంపల చినబాబు (చీపురుపల్లి), రెయ్యి సూరిబాబు (రాజాం), అలమండ చంద్రశేఖర్ (గజపతినగరం), ఎస్.ధనుంజయ నాయుడు (బొబ్బిలి), డి.సుదర్శన దేవప్రసాద్ (ఎస్‌కోట)లను నియమించారు. అలాగే, కమిటీలుగా కార్యదర్శులుగా 24 మందిని, సంయుక్త కార్యదర్శులుగా మరో 14 మంది నియామకమయ్యారు.

జిల్లా యువజన విభాగ కమిటీ ఇదే...

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా సంగంరెడ్డి బంగారునాయుడు (విజయనగరం), ఉపాధ్యక్షులుగా బెల్లాన వంశీకృష్ణ (చీపురుపల్లి), పెనుమత్స సంతోష్‌కుమార్ (నెల్లిమర్ల), ప్రధాన కార్యదర్శులుగా తిరిమిరెడ్డి సూరిబాబు (చీపురుపల్లి), బోడసింగి ఈశ్వరరావు (విజయనగరం), గేదెల వెంకటరమణ (బొబ్బిలి), దండు సత్తిబాబు (ఎస్.కోట), చనుమల్లు తులసి (నెల్లిమర్ల), ఆర్.రమణ (గజపతినగరం)లు నియామకమయ్యారు. కార్యదర్శులుగా 22 మందికి, సంయుక్త కార్యదర్శులుగా 11 మందికి అవకాశం కల్పించారు.

జిల్లా దివ్యాంగుల విభాగంలో...

వైఎస్సార్‌సీపీ జిల్లా వికలాంగుల విభాగ అధ్యక్షునిగా దవడ కొండబాబు (విజయనగరం), ఉపాధ్యక్షులుగా మజ్జి సత్యనారాయణ(బొబ్బిలి), యలమల రామయ్యమ్మ (నెల్లిమర్ల), ప్రధాన కార్యదర్శులుగా కొర్నాన రమణ (విజయనగరం), పల్లిల గౌరునాయుడు (ఎస్.కోట), నడుపూరు అప్పలస్వామినాయుడు (నెల్లిమర్ల), కె.లక్ష్మణరావు (గజపతినగరం), మీసాల రామినాయుడు (చీపురుపల్లి), ఐ.సింహాచలం (బొబ్బిలి), టొంపల శ్రీను (రాజాం)లు నియామకమయ్యారు. కార్యదర్శులుగా 23 మందికి అవకాశం కల్పించగా... సంయుక్త కార్యదర్శులుగా మరో 14 మందిని నియమించారు.

విసుగెత్తించిన యువగళం విజయోత్సవ సభ

- రెండు గంటల ఆలస్యంగా సభ ప్రారంభం
- పార్టీశ్రేణుల్లో అసహనం
- జిల్లా నేతల్లో ఏ ఒక్కరికి దక్కని ప్రసంగించే అవకాశం
- బాలకృష్ణ ప్రసంగానికి నవ్వుకున్న నాయకులు, కార్యకర్తలు



యువగళం సభకు దూరప్రాంతాల నుంచి విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న టీడీపీ శ్రేణులు



యువగళం సభలో చంద్రబాబు మాట్లాడుతుండగానే వెనుదిరిగిన పార్టీ శ్రేణులు



విజయనగరం రూరల్/పూసపాటిరేగ: భోగాపురం మండలం పోలిపల్లిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన లోకేశ్ యువగళం పాదయాత్ర విజయోత్సవ సభకు వచ్చిన జనం విసుగెత్తిపోయారు. రెండు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభం కావడం, జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో సభకు వచ్చేవారు ఇబ్బందులు పడ్డారు. కొందరు వాహనాలు దిగకుండానే వెనుదిరిగారు. స్థానికులు సభకు వస్తారో?లేదో? అన్న భయంతో ఇతర జిల్లాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులను సభకు రప్పించే ఏర్పాట్లు చేశారు. సుమారు ఆరు వేల మందివరకు ఇతర జిల్లాల నుంచి వచ్చినట్టు సమాచారం. సభలో నాయకులు పసలేని మాటలకు జనం నవ్వుకున్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏ ప్రాజెక్టునూ పూర్తిచేయకుండా.. జిల్లాకు ఓ మంచి పనీ చేయకుండా... అధికారం కోల్పోయిన ఐదేళ్లలో అన్నీ చేసి ఉండేవాడినంటూ ప్రగల్భాలు పలకడంపై గుసగుసలాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల తర్వాత జనసేన పార్టీ గురించి, నాయకుల గురించి ఆలోచన చేస్తామని చెప్పడంతో ఆ పార్టీ శ్రేణులు సందిగ్ధంలో పడ్డాయి. అసలు అధికారంలోకి వస్తారోలేదో తెలియదు.. అప్పుడే ఆంక్షలు పెడుతున్నారంటూ జనసేన పార్టీ కార్యకర్తలు అసహనం వ్యక్తంచేశారు. ఉచితాలు మాయలో పడొద్దంటూనే ఉచిత హామీలు ప్రకటించడంపై సభలో చర్చసాగింది. సభలో జిల్లాకు చెందిన నాయకులకు ప్రసంగించే అవకాశం ఇవ్వకపోవడంపై పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తంచేశారు. తమ హయాంలో ప్రజలకు చేసిన మంచి చెప్పకుండా... సభ అమాంతం జగన్‌మోహన్‌రెడ్డిని దూషించేందుకే ప్రాధాన్యం ఇవ్వడాన్ని రాజకీయవిశ్లేషకులు తప్పుబట్టారు. సభకు వచ్చేవారికి సరైన భోజనమూ కరువైంది.

బైజూస్ బోధనకు ట్యాబ్‌లు సిద్ధం

- వరుసగా రెండో ఏడాది పంపిణీకి చకచకా ఏర్పాట్లు
- జిల్లాకు 17,324 ట్యాబ్‌ల మంజూరు
- సద్వినియోగమయ్యేలా నిరంతర పర్యవేక్షణ: డీఈఓ



ట్యాబ్‌లను మండల కేంద్రాలకు పంపుతున్న పాఠశాలవిద్యా కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్

విజయనగరం అర్బన్: విద్యావ్యవస్థలో బైజూస్ కంటెంట్ బోధన వినూత్నం, విప్లవాత్మకం. ఎంతో ప్రియం అయిన బైజూస్ బోధనలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేరువచేసింది. దీనికోసం ఏటా 8వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేస్తోంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్యాబ్‌ల పంపిణీకి విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. గతేడాది ఉమ్మడి విజయనగరం జిల్లాలో విద్యార్థులు, టీచర్లకు కలిపి మొత్తం 21,448 ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులతో పాటు కొత్తగా పదోన్నతులు పొందిన సబ్జెక్టు టీచర్లకు ట్యాబ్‌లు అందజేయనుంది. ఇప్పటికే పాఠశాలవిద్య ఉన్నతాధికారులు జిల్లాకు 9,180 ట్యాబ్‌లు పంపించారు. మిగిలిన 8144 ట్యాబ్‌లు రెండుమూడురోజుల్లో రానున్నాయి. ప్రతి ట్యాబ్‌ను మూడేళ్ల వారంటీతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. స్క్రీన్ డామేజీ అయితే ప్రభుత్వమే రిపేరీ చేయించాలని నిర్ణయించింది.

దుర్వినియోగం కాకుండా చర్యలు...

ట్యాబ్‌లను దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం 'టెక్నోరో' అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ భాగస్వామ్యంతో ట్యాబ్‌లలో యూట్యూబ్, కెమెరా, ఇతర యాప్‌లు ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టింది. మూడు యాప్‌ల (వైఫై, బైజూస్, డిక్షనరీ)ను అందుబాటులో ఉంచింది. అప్‌డేట్ చేయడానికి ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాక్టివ్ టీచర్లు, డిజిటల్ అసిస్టెంట్‌కు శిక్షణ ఇచ్చి పాఠశాల స్థాయిలోనే అప్‌డేట్ చేయిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లు దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ బాధ్యతలను అధికారులకు అప్పగించింది. డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌లను పరిశీలిస్తారు. సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు నెలకోసారి ప్రతి పాఠశాలనూ సందర్శించి ట్యాబ్‌ల పనితీరును చెక్ చేస్తారు. ట్యాబ్‌ల రిపేరీ బాధ్యతలు కూడా వారే చూస్తారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రతి వారం పాఠశాలలను సందర్శిస్తారు. ప్రతి శుక్రవారం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడి ట్యాబ్‌లకు వైఫై కనెక్ట్ చేసి వినియోగ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓల వివరాలు

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ప్రతి పోలింగ్ స్టేషన్లో బీఎల్‌ఓ పేరు, ఫోన్ నంబర్‌ను ప్రదర్శనగా ఉంచాలని అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఓటర్లు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈ నంబర్లు ఉపయోగపడతాయన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం సమావేశమయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా వచ్చిన వివిధ దరఖాస్తుల పరిశీలన ఈ నెల 26తో ముగుస్తుందని చెప్పారు. అనంతరం ఓటర్ల జాబితాలను తయారు చేస్తామని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఈఆర్‌ఓలు వెంకటేశ్వరరావు, సుదర్శనదొర, నూకరాజు, సుధారాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ల సేకరణను వేగవంతం చేయండి

- ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్



పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే స్థానికుల్లో నగదును ఆదా చేసుకునే ఆలోచన గతంలో కన్నా అధికశాతం పెరిగినందున ప్రాథమిక సహకార బ్యాంకులో డిపాజిట్ల సేకరణలో జోరుపెంచాలని ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ సూచించారు. చల్లపేట పీఏసీఎస్ బ్యాంకును ఆయన బుధవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. బ్యాంకు ఏర్పాటైన తరువాత డిపాజిట్ల సేకరణ ఎలా జరుగుతుందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన రైతులకు రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

హోరాహోరీగా...



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



మహిళల కబడ్డీ..కబడ్డీ

విజయనగరం: నగరంలోని మహిళా పార్కులో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజు ఆటల పోటీల్లో భాగంగా క్రీడాకారిణులను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు గురువారంతో ముగుస్తాయన్నారు. చరిత్రలో తొలిసారి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ముగింపు కార్యక్రమంలో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన విజేత జట్లకు రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు చొప్పున నగదు, ట్రోఫీలను అందజేస్తామన్నారు. పోటీల్లో మహిళలు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు.